# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 28-06-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆధునిక సాంకేతికత సాయంతో ఆంధ్రప్రదేశ్ ని నేర రహిత రాష్ట్రంగా తయారు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పోలీసులకు సూచించారు.**
2. **జాతీయ ఎంఎస్ఎంఈ ఇంపాక్ట్ అవార్డుల్లో ఆంధ్రప్రదేశ్‌కు రజత పతకం లభించింది.**
3. **ప్రభుత్వం కేటాయించిన గృహ నిర్మాణాలు త్వరలో పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ శాఖమంత్రి కొలుసు పార్థసారథి అధికారులను ఆదేశించారు.**
4. **ప్రభుత్వం సంక్షేమానికి, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తోందని తెలంగాణ మంత్రులు తెలిపారు.**
5. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ “మన్ కీ బాత్” కార్యక్రమం రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.**

==========================

ఆధునిక సాంకేతికత సాయంతో ఆంధ్రప్రదేశ్‌ని నేర రహిత రాష్ట్రంగా తయారు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పోలీసులకు సూచించారు. గుంటూరులోని ఆర్ వీఆర్ & జేసీ కళాశాలలో నిర్వహించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫర్ ఏపీ పోలీస్ – హ్యాకథాన్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా వాట్సాప్ గవర్నెన్స్ తీసుకొచ్చినట్లు పేర్కొంటూ...

,,,వాయిస్ .. 35 సెకన్లు

అనంతరం పల్నాడు జిల్లా ఎడ్లపాడు మండలం, కొండవీడులో చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే కేంద్రాన్ని ముఖ్యమంత్రి సందర్శించారు. ప్లాంట్‌లో వ్యర్థాలను వేరు చేయడం, విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

--------------------------

ప్రపంచ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల దినోత్సవం సందర్భంగా జాతీయ ఎంఎస్ఎంఈ ఇంపాక్ట్ అవార్డుల్లో ఆంధ్రప్రదేశ్ కు రజత పతకం వచ్చినట్లు రాష్ట్ర ఎంఎస్ఎంఈ అభివృద్ధి సంస్థ సీఈఓ ఎం.విశ్వ ఓ ప్రకటనలో తెలిపారు. ఢిల్లీలో నిన్న జరిగిన కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ డెవలప్మెంట్ కార్పోరేషన్ తరపున రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ అభిషక్తి కిషోర్ ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా మంత్రులు

కొండపల్లి శ్రీనివాస్, టి.జి భరత్ అధికారులను అభినందించారు.

---------------------------

ఈ ఏడాది చివరి నాటికి ప్రభుత్వం కేటాయించిన గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ శాఖమంత్రి కొలుసు పార్థసారథి అధికారులను ఆదేశించారు. విశాఖపట్నం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా గృహ నిర్మాణ పథకం అమలు తీరుపై అధికారులతో నిన్న ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రానున్న నాలుగేళ్లలో అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ఇల్లు ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. పేదల గృహ నిర్మాణానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొంటూ...

- వాయిస్..31 సెకన్లు

---------------------------

ప్రభుత్వం సంక్షేమానికి, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తోందని తెలంగాణ మంత్రులు తెలిపారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో రాష్ట్ర మంత్రులు కోమటి రెడ్డి వెంకటరెడ్డి, దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి తుమ్మలనాగేశ్వరరావు మాట్లాడుతూ..

- వాయిస్..18 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 123వ సంచిక రేపు ప్రసారం అవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామానికి చెందిన సుమా మణికి కేంద్రం ఆర్థిక సహాయం చేసింది. కరోనా సమయంలో తల్లిదండ్రుల్ని కోల్పోయిన ఆమెకు మిషన్ వాత్సల్య-పీఎం బాల సంరక్షణ యోజన-పీఎం కేర్ కింద 10 లక్షల రూపాయల చెక్కును ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షురాలు డి.పురేందేశ్వరి నిన్న అందజేశారు. ఈ విధంగా కేంద్రం ఆర్థిక సాయం చేయడం దేశంలోనే తొలిసారి అని ఆమె పేర్కొంటూ..

.. వాయిస్..28 సెకన్లు

---------------------------

పాలనాదక్షుడు, బహు భాషా వేత్త, భారత దేశానికి తొమ్మిదవ ప్రధాన మంత్రిగా వ్యవహరించిన పాములపర్తి వెంకట నరసింహారావు (పివి నరసింహారావు) జయంతి ఈ రోజు. ఆయన... ప్రధాన మంత్రి పదవిని అధిష్టించిన దక్షిణ భారతానికి చెందినవ్యక్తి, తెలుగు వారు కావడం కూడా విశేషం. భారత ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మకమైన సంస్కరణలకు బీజంవేసి ....ఆర్థిక వ్యవస్థను సక్రమ మార్గంలో పయనింపజేసిన ఘనత ఆయనకే దక్కుతుంది.

1921 జూన్ 28 వ తేదీన తెలంగాణా రాష్ట్రంలోని నరసం పేట వద్ద లక్నేపల్లి గ్రామంలో జన్మించిన ఆయన 1957 సంవత్సరంలో రాజకీయ జీవితం ఆరంభించారు. రాష్ట్ర మంత్రిగా, ముఖ్యమంత్రిగానే కాకుండా కేంద్ర రాజకీయాలలో ప్రవేశించి ప్రధాన మంత్రి పదవిని చేపట్టారు. 2004 డిసెంబర్ 23 వ తేదీన పి.వి.నరసింహారావు తుదిశ్వాస విడిచారు.

---------------------------

భారతదేశంలో విదేశాంగ విధానాన్ని బలోపేతం చేయడంలో మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు చేసిన కృషి అనుసరణీయమని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా రాజ్ భవన్ లో ఆయన చిత్రపటాన్ని గవర్నర్ నిన్న ఆవిష్కరించారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ.. దేశ ఆధునిక చరిత్రను పివి నరసింహారావు విప్లవాత్మక రీతిలో మలుపు తిప్పారని కొనియాడారు.

---------------------------

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నిరుపేదకు విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లను ఇస్తోందని తెలంగాణ ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ కాటారం మండలంలో మంత్రి పలు అభివృద్ధి పనులకు నిన్న శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పలువురు లబ్ధిదారులకు అందజేశారు. దివ్యాంగులకు ట్రై సైకిల్, వినికిడి పరికరాలను, బ్రెయిలీ లిపి సామాగ్రిని పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నట్లు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రస్తుత వాతావరణ పరిస్థితిపై అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి జి.లక్ష్మీ ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్... 18 సెకన్లు

మరోవైపు.. తెలంగాణాలోని కొన్ని జిల్లాల్లో రానున్న 5 రోజులపాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

---------------------------

విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ డైరెక్టర్ల ప్రమాణస్వీకారం నిన్న జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హాజరై డైరెక్టర్లగా ఎన్నికైన ఈ రజిని, ఏ. రమణారావు, ఎండి రమేష్ కుమార్, పి. రవీంద్రనాథ్, ఎస్. సంతోష్ కుమార్, కే, జగదీశ్వరి, పి. బి. వి. ఎస్. ఎన్ రాజులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

=====================